

నదీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి 8

ఈ యేడూ ఇక్కట్లు తప్పవా..? 8
● తక్కళ్లపల్లి - సిరికొండ వంతెన పూర్తయ్యేదెప్పుడో

చక్కెర కర్మాగారానికి మంచి రోజులు

- ఎన్‌డీఎస్‌ఎల్ పునరుద్ధరణకు కాంగ్రెస్ సర్కారు చర్యలు
- ఇప్పటికే శాసన సభ సంఘం ఏర్పాటు
- నిజాం షుగర్స్ తెరిపిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటన
- తాజాగా బడ్జెట్‌లో రూ. 138 కోట్ల నిధుల కేటాయింపు
- చెరుకు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- తొలుత ముత్యంపేట ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సర్కారు యోచన

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తెలంగాణకే గర్వకారణంగా ఉన్న నిజాం షుగర్ లిమిటెడ్ పలు రకాల ఒడిదుడుకుల కారణంగా మూతపడింది. దీనిని ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోలేదు. దాని పునరుద్ధరణకు ఏ మాత్రం ఆసక్తి చూపించలేదు. కానీ మా ప్రభుత్వం వచ్చిన వెంటనే మేము ఇచ్చిన మాట ప్రకారం నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు జనవరి 2024లో ఒక కమిటీ నియమించాము. త్వరలోనే తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన నిజాం షుగర్స్ లిమిటెడ్‌ను తిరిగి ప్రారంభిస్తాము...ఇవీ గత రెండు రోజుల క్రితం అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగంలో భాగంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్న మాటలు..

లే ఆఫ్ కారణంతో మూసివేసిన నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలకు మంచి రోజులు వస్తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట, నిజామబాద్ జిల్లా బోదన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో మూతపడ్డ నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాల పునరుద్ధరణపై దృష్టి సారిస్తోంది. సుమారు ఆరు నెలల క్రితం శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్‌డీఎస్‌ఎల్ కర్మాగారాల పునరుద్ధరణపై ప్రకటన చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ నిజాం షుగర్స్ అంశాన్ని ప్రస్తావించారు. దీనికి తోడు ప్రస్తుత యేడాది జనవరిలో ప్రభుత్వం శాసన సభ కమిటీని ర్పాటు చేసి కర్మాగారాల పునరుద్ధరణ అంశాన్ని అధ్యయనం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఏర్పాటు అయిన శాసన సభ కమిటీ 2024 ఫిబ్రవరి చివరి వారం, మార్చి తొలి వారంలో బోదన్, ముత్యంపేట చక్కర కర్మాగారాలను సందర్శించింది. ఇక్కడి రైతులు, కార్మికులతో కమిటీ సభ్యులు నేరుగా మాట్లాడారు. కర్మాగారాల పరిస్థితి, పునరుద్ధరణకు అవసరమైన అంశాలపై ప్రభుత్వానికి కమిటీ సూచించింది. ఫ్యాక్టరీని తెరిపించేందుకు మొగ్గు చూపిన కమిటీ, 51 శాతం వాటా ఉన్న యాజమాన్యం మూడు యూనిట్లపై రూ. 190 కోట్ల అప్పు చేయగా, ప్రభుత్వం ఇప్పటికే రూ. 160 కోట్లు చెల్లించింది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చేసిన ప్రకటన రైతులల్లో ఆశలు మరింత చిగురింపజేస్తోంది. రానున్న రెండు నెలల్లో మిగిలిన రూ. 30 కోట్ల చెల్లించి రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేసుకొని పునరుద్దరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో తొలుత జిల్లాలోని ముత్యంపేట చక్కర కర్మాగారాన్ని పునరుద్దరించాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఎనిమిదిన్నరేళ్లుగా మూసివేతలోనే...

రాష్ట్రంలో ప్రత్యేక స్థానాన్ని కలిగియున్న నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారానికి సంకెళ్లు పడి ఎనిమిదిన్నర సంవత్సరాల కాలమైంది. 2015 డిసెంబర్ 22 అర్ధరాత్రి యాజమాన్యం లేఆఫ్ ప్రకటనతో మూసి వేసింది. నాటి నుంచి నేటి వరకు కర్మాగారాలు తెరుచుకోలేదు. దీంతో అటు చెరుకు రైతులు, ఇటు ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు, కర్మాగారంపై ఆధారపడి జీవిస్తున్న వివిధ రంగాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు.


లే ఆఫ్ ఎలా జరిగిందిలా...

ముడి సరకు, నీటి కోరత ఉందని ఫ్యాక్టరీని నడపలేని పరిస్థితి ఉందని నిజాందక్కన్ షుగర్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) యజమాని ఫ్యాక్టరీని 2015 డిసెంబర్ 22 రోజున అర్ధరాత్రి లేఆఫ్ ప్రకటించారు. దీంతో మెట్‌పల్లి, బోధన్, మంబోజిపల్లి యూనిట్లు మూత పడ్డాయి. కార్మికులకు చెల్లించాల్సిన డబ్బు, వేతనాలు, ఇతర బెన్‌ఫిట్స్ ఇవ్వాలంటే ఫ్యాక్టరీని అమ్మాల్సిందేనని నేషనల్ కంపెనీ లా (ట్రిబ్యూనల్) తీర్పు ఇచ్చినా అమలుకు నోచలేదు.

కార్మిక, కర్షక కుటుంబాల్లో చిగురిస్తున్న ఆశలు...

ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్స్ కర్మాగారంలో లేఆఫ్‌తో వందల సంఖ్యలో కుటుంబాలు వీధి పాలవుతున్నాయి. ఒకప్పుడు 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసిన చక్కెర కర్మాగారం ప్రస్తుతం లేఆఫ్‌కు గురికావడంతో దీనిపై ఆధారపడ్డ జీవనాలు చిన్నాభిన్నామయ్యాయి. ముత్యంపేట చక్కెర కర్మాగార పరిధిలోని జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో గల చెరుకు రైతులు, కార్మికులు, ట్రాన్స్‌పోర్టు యజమానులు, కూలీలు, హార్వెస్టర్ కార్మికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల మంది ఎన్‌డీఎస్‌ఎల్ లేఆఫ్‌తో సమస్యల పాలయ్యారు. ఎన్‌డీఎస్‌ఎల్ చక్కెర కర్మాగారం పరిధిలో సుమారు 500 మంది పర్మనెంట్, సీజనల్, కాంట్రాక్ట్ వర్కర్లు పనిచేసేవారు. ఇందులో సుమారు 300 మంది సీజనల్, 200 మంది కాంట్రాక్టు వర్కర్లు ఉండేవారు. 150 లారీల్లో చెరుకును కర్మాగారా నికి చేర్చేవారు. ప్రతీ యేటా రూ. కోట్లలో లావాదేవీలు జరుగుతుండేవి. తద్వారా ఈ ప్రాంతంలో గల ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రు లు, ఆర్‌ఎంపీ, పీఎంపీలు పలు రంగాల వ్యాపారులు, పెట్రోలు బంకులు, సినిమా హాళ్లు, కుల వృత్తులు నిర్వహించుకునే కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా లాభపడేవి. కర్మాగారం మూసివేత ప్రభావం ఈ రంగా లపై పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం
జువ్వాడి నర్సింగ్‌రావు, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి



నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపిస్తామని అన్నదాతలకు ఇచ్చిన మాటకు కాంగ్రెస్ సర్కారు కట్టుబడి ఉంది. ఇందులో భా గంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జనవరిలో శాసన సభ కమిటీని ఏర్పాటు చేసింది. మార్చిలో కమిటీ కర్మాగారాన్ని సందర్శించింది. కర్మాగార అప్పులను కొంత వరకు చెల్లించింది. తాజాగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సైతం బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైన ప్రకటన చేశారు.

చిరకాల స్వప్నం నెరవేరబోతోంది
వాంకిడి సత్యంరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు



తెలంగాణ రైతాంగం చిరకాల స్వప్నమైన నిజాం దక్కన్ షుగర్స్ లిమి టెడ్ కర్మాగారాలు తెరుచుకోబోతున్నాయి. కర్మాగారాలకు పూర్వ వైభవం దక్కనుంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ముత్యంపేట, బోదన్, ముం బోజుపల్లి ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్ల పునః ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను సైతం ప్రభుత్వం కేటాయించింది. గతంలో పాలకులు ఎన్‌డీఎస్‌ఎల్ యూనిట్లను తెరిపించే అంశాన్ని గాలికి వదిలి వేశారు.



భూ సమస్యలను సక్రమంగా పరిష్కరించాలి
కలెక్టర్ సత్యప్రసాద్



అధికారులకు సూచనలు అందిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలతో పాటు మున్సిపాలటీల్లో నెలకొన్న భూసమస్యలను సక్రమంగా పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్ తహసీల్దార్‌లకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను అందించారు. ప్రతి తహసీల్దార్ మండలం పరిధిలోని భూముల వివరాలను కలిగి ఉండాలన్నారు ధరణి సమస్యలు, ప్రజావాణి ఫిర్యాదు వక్ఫ్ బోర్డు, ప్రభుత్వ భూములను గుర్తించి వాటి పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాలలో భూ వివాదాలు, కోర్టు కేసులన్నిటి ఎప్పడికప్పుడు పరిష్కరించాలని ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు మధుసుదన్, అనంద్ కుమార్, నక్క శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్



ధరూర్‌లో రోగుల రక్తనమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

జగిత్యాలరూరల్, జూలై 26 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామంలో గ్రామంలో శుక్రవారం డెంగీపై అవగాహన, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇండ్ల వద్ద నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లుపెట్టి లార్వాగా రూపాంతరం చెంది వాటి నుంచి దోమల పునరుత్పత్తి పెరు గుతుందన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీలు గ్రామాల్లో క్రమం తప్పకుండా రోజూనీరు విడుదల చేస్తే గ్రా మాల్లో నీరు నిల్వకుండా ఉంటుందని తద్వారా కొంత మేర డెంగీ కేసులను నివారించవచ్చునని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరకు 65 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం తక్కువ డెంగీ కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ భెనర్జీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ముసురు వర్షం

జగిత్యాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఓ ముసురు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సగటున 5.72 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా సారంగపూర్‌లో 14.8 మిల్లీ మీటర్లు, ఎండపల్లి మండ లం మారేడుపల్లిలో 14.5 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ధర్మపురి మండలం జైనాలో 0.8 మిల్లీ మీటర్లు, బుగ్గారం మండలం సిరికొండ, ధర్మపురి మండలం నేరేళ్లలో 1.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కాగా జిల్లాలోని మేడిపల్లిలో 11.0 మిల్లీ మీటర్లు, మల్లాపూర్ 10.3, జగిత్యాల 8.5, రాయికల్ మండలం అల్లీపూర్ 8.3, మల్యాల 8.0, కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ 7.8, భీమారం మండలం మన్నెగూడెం, మల్యాల మండల మద్దుట్ల, రాయికల్‌లలో 7.5, వెల్గటూరు 7.3, పెగడపల్లి, గొల్లపల్లి, జగత్యాల రూరల్ మండలం పోలాసాలలో 6.5, కోరుట్ల 6.0, కోరుట్ల మండలం అయిలాపూర్, మల్లాపూర్ మండలం రాఘవపేట, కొడిమ్యాల మండలం పూడూరులలో 5.8, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లి, మెట్‌పల్లిలలో 5.0, ఇబ్రహీంపట్నం మండలం గోదూరు 3.5, ఎండపల్లి, కథలాపూర్‌లలో 3.0, ఎండపల్లి మండలం గుల్లకోట, భీమారం మండలం గోవిందారం 2.0, బీర్‌పూర్ మండలం కొల్వాయి 1.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

డీసీవోకు సన్మానం

జగిత్యాల అర్బన్, జూలై 26: జిల్లా సహకార అధికారిగా నియమితులైన రఘువరణ్‌ను జిల్లాలోని పలువురు ప్యాక్స్ చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కల్లెడ, నంచర్ల, జైన, రాయికల్, చందోలి ప్యాక్స్ చైర్మన్‌లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, వేణుగోపాల్, నరేష్, మల్లారెడ్డి, మాధవరావు తదితరులున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

భీమారం, జూలై 26: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో గురువారం రాత్రి రెండు ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ శివారులో గల శివాలయం, మల్లిఖార్జున ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టారు. రెండు హుండీలను బయటకు తీసుకువచ్చి హుండీ తాళాలు పగులగొట్టి అందులో గల నగదు చోరీ చేశారు. చోరీ సంఘటన స్థానికులను కలిచివేసింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల టౌన్, జూలై 26 : వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రభల కుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో శుక్రవారం పారిశుద్ధ్య పనులను చైర్ పర్సన్ ఆకిస్మికంగా తనిఖీ చేశారు. డ్రైడేలో భాగంగా నీటి గుంతల్లో నిలిచిన నీటిని తొలగించేలా చర్యలు చేపట్టారు.

అనంతరం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ అధికారులు మారుతి ఉన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

సాంస్కృతిక కార్యక్రమాలతో నూతనోత్సాహం

●అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డా.నరేందర్ రెడ్డి ●ఆకట్టుకున్న అల్ఫోర్స్ స్వాగతోత్సవ్-2024



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

జగిత్యాల అర్బన్, జూలై 26: సాంస్కృతిక కార్యక్రమాలతో నూత నోత్సాహం రెట్టింపు అవుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.నరేందర్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవి గార్డెన్‌లో అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల నూతన విద్యార్థుల కు స్వాగతం పలికేందుకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరిగిందని అదే సమయంలో అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు ముందుకు సాగుతున్నారన్నారు. తల్లితండ్రులు కూడా విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేధించేందుకు తోడ్పాటును అందించాలన్నారు. గత 34ఏళ్లుగా అల్ఫోర్స్ విద్యా సంస్థలు నిర్విరామంగా చేస్తున్న కృషి చేస్తుందని, విద్యాభివృద్ధిలో నూతన ఒరవడిని సృష్టిస్తూ సమాజంలో మార్పులకు అనుగుణంగా ముందుకుసాగుతూ సంచలన విజయాలు నమోదు చేస్తున్నామన్నారు. విద్యార్థులను అన్ని రకాలుగా అభివృద్ధి పర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు అహూతులను అలరించాయి. అనంతరం వార్షిక ప్రణాళికల్లో భాగంగా నిర్వహించిన పరీక్షలు, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, పోషకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సైనికులారా వందనం

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

జగిత్యాల అర్బన్, జూలై 26: పట్టణంలోని స్థానిక జ్యోతి హై స్కూల్ ఐఐ టీ పాఠశాలలో కార్గిల్ విజయ్‌దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా, దేశ సైనికుల ఔన త్యం ప్రతిబింబించేలా నినాదాలు చేశారు. మాజీ సైనికుడు, పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు మాట్లాడుతూ 1999 మే 3న కార్గిల్ జిల్లాలోని యంత్రణ రేఖ వెంబడి భారత్, పాక్ మధ్య కార్గిల్ యుద్ధం ప్రారంభం అయ్యింది. విజయ్ అనే కోడ్ నేమ్‌తో భారత సైన్యం 60రోజుల పాటు యు ద్ధం చేసిందన్నారు. ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరు లయ్యారని, భారత భూభాగం స్వాధీన పర్చుకొని పాక్‌ను తిప్పికొట్టి భారత్ పాక్‌పై విజయం సాధించిందన్నారు. అందువల్లనే ప్రతియేటా జూలై 26న కార్గిల్ విజయ్‌దివాస్ జరుపబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, ఉపాధ్యాయ బృందం, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



జగిత్యాలలో అమరులకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద కార్గిల్ దివస్ పురస్కరించు కోని అమర జవానులకు ఘన నివాళిని బీజేపీ, బీజేవెఎం, ఏబీవీపీ ఆర్‌ఎస్‌ఎస్, హిందూవాహిని శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులు, కాగడ హారతులతో అమరులకు నివాళ్లను అర్పించారు. దేశ రక్షణకు అమరుల త్యాగాలు గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవెఎం, ఏబీవీపీ, ఆర్ ఎస్ఎస్, హిందువాహిని నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: భారతీయ జనతా పార్టీ రాయికల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ అమరవీరులకు స్థానిక భరతమాత విగ్రహం వద్ద కొవ్వొ త్తులతో నివాళులు అర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను కొనియాడుతూ దేశం సుభిక్షంగా, శాంతితో, సంతోషంగా ప్రజలు జీవిస్తున్నారంటే మన భారత సైనికుల త్యాగాలేనని కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోనూ కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, రాష్ట్ర కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కురుమ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, పట్టణ ఉపాధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎస్ఐ అశోక్, క్లబ్ అధ్యక్షుడు మత్స్య శేఖర్, శ్రీకాంత్, దళిత మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గుగ్గిల్ల రాము, కార్యదర్శి సామల్ల సతీష్ పాల్గొన్నారు.



రాయికల్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



కోరుట్లలో అమరులకు కొవ్వొత్తులతో నివాళి

●రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా వీరులైన సైనికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం సాధించి నేటికీ 25 సంవత్సరాలు అవుతుందని, దేశ ప్రజల కోసం ప్రాణాలర్పించిన వీరులను మనం స్మరించాలని, ప్రతి విద్యార్థి దేశ భక్తిని కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ బాలె శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరులకు శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కు రవిందర్, వేంకటేశ్వర్‌రావు, జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

కథలాపూర్ : కార్గిల్ పోరులో అమరులైన వీర జవానులకు కథలాపూర్‌లో లయన్స్‌క్లబ్ సభ్యులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సైనికుల వీరోచిత పోరాటంతో శత్రుమూకలను మట్టుబెట్టారని గుర్తు చేశారు. విజయ్‌దివస్‌ను ఘనంగా నిర్వహించారు. బస్టాండ్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పిడుగు సంజీవ్‌రెడ్డి, ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

గోదావరిఖనిలో నకిలీ వైద్యులపై కొరడా

● ఆసుపత్రులను సీజ్ చేసిన తెలంగాణ వైద్య మండలి
● పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకుంటే చర్యలు: వైద్యాధికారి రాజ్‌కుమార్

కళ్యాణ్‌నగర్, జూలై 26: గోదావరిఖని పట్టణంలో అనుమతి లేకుండా ఆసుపత్రులను నడుపుతున్న నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి కొరడా ఝుళిపించింది. శుక్ర వారం తెలంగాణ వైద్య మండలి సభ్యుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస క్లినిక్, శివ పైల్స్ క్లీనిక్ పేరిట చికిత్స చేస్తున్న ఆసుపత్రులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గోదావరిఖనిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది క్లీనిక్‌లు ఏర్పాటు చేసి అల్లోపతి, ఆయుర్వేదం, పైల్స్ ఆసుపత్రులు నెలకొల్పారని, అందులోనే ల్యాబ్‌లను, మెడికల్ షాపులను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్, స్టెరైడ్స్ ఇస్తున్నట్టు గుర్తించామని, వారిపై ఎన్ఎంసీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు చెప్పారు. అర్హత లేని వ్యక్తులు ప్రైవేట్‌గా క్లీనిక్‌లు పెట్టి ప్రాక్టిస్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, పేరుకు ముందు డాక్టర్‌గా పెట్టుకోవద్దని, ఎవరైనా అనుమతి లేకుండా ప్రాక్టిస్ నిర్వహిస్తే వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెచ్‌ఆర్‌డీఏ సెక్రెటరీ గౌతం, బృందం పాల్గొన్నది.

క్లీనిక్‌లు మూసి వేసిన ఆర్‌పీఎంలు, పీఎంపీలు

గోదావరిఖనిలో శుక్రవారం పలు ఆసుపత్రులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న కొంతమంది ఆర్‌పీఎంలు, పీఎంపీలు క్లీనిక్‌లను, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లను, మెడికల్ షాపులను మూసివేసి పరుగులు తీశారు. ఈ బృందం ఎక్కడెక్కడ తనిఖీ చేస్తుందో సమాచారం తెలుసుకుని వారిని అనుసరించారు. అధికారుల బృందం కొన్ని ఆసుపత్రులకు వెళ్లే సరికి మూసివేసి ఉన్నాయి.



ఆర్ఎంపీ క్లీనిక్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

కేంద్ర బడ్జెట్‌తో నిరాశ.. రాష్ట్ర బడ్జెట్‌తో ఊరట



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, జూలై 26: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలకు నిరాశ మిగిల్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఊరట లభించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్ర వారం సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడం కోసం వివిద శాఖలకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకుడు బడ్జెట్ సమావేశాల్లో పూర్తి స్థాయిలో పాల్గొనకుండా బడ్జెట్ అంశాలను విని సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా అనే అభిప్రాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై తన అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అధికారం కోల్పోయామని తిరిగి అధికారం కోసమే విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, నియంతలాగా వ్యవహరించడంతోనే ప్రజలు ఓడించారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి అనేక సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించారని, వాటిని అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. రేషన్ కార్డులపై ఇప్పటి వరకు ప్రభుత్వానికి ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక మంది రైతుల భూములకు సంబంధించిన సమస్య లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూమాతతో రైతుల సమస్యల పరిష్కారి స్తామని చెప్పిన ప్రభుత్వం భూ సర్వే నిర్వహించి సాగు చేసుకుంటున్న అసలైన పట్టాదారులకు పట్టాదారు పాసు బుక్కులు అందించాలన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి చేనేత కుటుంబాలను ఆదుకో వాలన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, తాండ్ర సదానందం, వెన్న సురేష్, సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్



మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

సుభాష్‌నగర్, జూలై 26: బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం మాట్లాడుతూ చత్రపతి సాహూమహరాజ్ నిమ్న కులాలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేశారని తెలిపారు. 1902 జూలై 26న వెనకబడిన కులాలు, అంటరాని కులాలకు, మహిళలకు విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని అన్నారు. సాహూ మహరాజ్ బ్రిటీష్ ఇండియాలోని కొల్హాపూర్ సంస్థానానికి రాజు అని తెలిపారు. వెనకబడిన, నిమ్నవర్గాల పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారని, విద్య దూరం అయిన కులాలకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించాడని, మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన పాఠశాలలకు ఆయన నిధులు కేటాయించి నిమ్న కులాలకు విద్యావ్యాప్తి కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకొని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దడ్డె శ్రీనివాస్, దొడ్డె సమ్మయ్య మాతంగి అశోక్, మంద బాలయ్య, కల్లెపెల్లి రాజేందర్, మాంకాలి తిరుపతి, పల్లె ప్రశాంత్‌గౌడ్, మారపెల్లి మొగిలయ్య పాల్గొన్నారు. బీఎస్పీలో ఎలగందల్‌కు చెందిన బోనాల సంతోష్, కిన్నెర రజనీకాంత్ చేరారు. జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

గంజాయి కేసులో పలువురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని చింతకింది భానుచందర్, గోనె ఉదయ్ రాపల్లి వాగు వంతెన వద్ద గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని విచారించారు. కరీంనగర్‌లోని గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది.

ఇల్లంతకుంట: మండలకేంద్రానికి చెందిన మహమ్మద్ జమీర్ గంజాయి కేసులో అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆటో నడుపుకునే జమీర్ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయి కిట్ ద్వారా పరీక్షించగా పాజిటీవ్‌గా తెలింది. జమీర్ వద్ద నుంచి 100 గ్రా. గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

సిరిసిల్ల క్రైం: రెండు గంజాయి కేసుల్లో నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వీరబోయిన అజయ్, సిరిసిల్ల మండలం చిన్న బోనాలకు చెందిన అవునూరి ప్రశాంత్, పండుగ మహేశ్, సందవేణి మహేశ్ ఉన్నట్లు పేర్కొన్నారు. 150 గ్రాముల గంజాయి, 5 గంజాయి సిగరెట్లు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు



వృద్ధుడి చేతులపై కుక్కగాట్లు

గంభీరావుపేట, జూలై 26: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో వృద్ధుడిపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేశాయి. లింగన్నపేటకు చెందిన లక్ష్మణ్ పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. రోడ్డుపై వెళ్తున్న లక్ష్మణ్‌ను వెంటపడి మరీ దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు గౌరీ శంకర్ అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్‌కు తన వంతు సాయంగా హమీద్ వెయ్యి రూపాయలు అందజేశారు.

16.109 టీఎంసీలకు చేరుకున్న శ్రీపాద ఎల్లంపల్లి



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

- మోటర్లు ఆన్ చేసి మిడ్ మానేరుకు నీటిని తరలించేందుకు రంగం సిద్ధం
- నీటిపారుదల శాఖ అధికారుల సమావేశంలో ప్రభుత్వ నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల సుమారు 23 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఆదివారం కల్లా ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీళ్లు రానున్నాయి. అయితే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోకముందే ప్రాజెక్టులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిపెట్టడం పరిపాటి. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల మిడ్ మానేరు, లోయర్ మానే డ్యామ్‌లకు వరద నీరు పెద్దగా రాకపోవడంతో ఆ ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తకుండా ఒకటి, రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నంది మేడారం నంది పంప్‌హౌస్, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో గల గాయత్రి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి మిడ్ మానేరు నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో గోదావరి పరివాహక ప్రాంత నీటిపారుదలశాఖ అధికారులతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తక్షణమే ఎల్లంపల్లి ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తేనే కొంత మేలు జరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు 23,701 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో ప్రాజెక్టు 16.109 టీఎంసీల నీటిమట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం వస్తున్న వరద నీరు ఇలాగే కొనసాగితే శనివారం సాయంత్రం కల్లా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టనికి చేరుకోనున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి చేరుకోక ముందే నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎగువప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో గల శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ మిడ్ మానేరు పూర్తిస్థాయి నీటిమట్టం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. కరీంనగర్ శివార్లో గల లోయర్ మానేర్ డ్యాం పూర్తి నీటిమట్టం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ రెండు రిజర్వాయర్ల ఎగువ ప్రాంతంలో వర్షాలు అంతగా కురవకపోవడంతో వరద నీరు తక్కువగా వస్తున్నది.

ఈ నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. మిడ్ మానేరుకు తరలించిన నీటిని, అవసరమైతే ఎల్ఎల్ఎండీకి, లేదంటే మల్లన్న సాగర్‌కు కూడా తరలించుకునే అవకాశాలు ఉన్నాయి. వర్షాల వల్ల వచ్చిన నీటిని వచ్చినట్లే మోటార్ల ద్వారా ఎత్తిపోస్తే వానా కాలం సీజన్, వచ్చే యాసంగి సీజన్‌కు సాగునీటికి డోకా లేకుండా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తున్న అదనపు వరద నీటిని గేట్లు ద్వారా గోదావరిలోకి వదిలి పెట్టకుండా, నంది పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్‌లను ఆన్ చేసి నీటిని మానేరులోకి ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

ప్రాజెక్టులోకి 25,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,150 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 28.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 59. 766 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 564 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 22.360 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.302 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మల్యాల, జూలై 26: మండలంలోని రాజారం ప్రభుత్వ పాఠశాలలో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పాఠశాల ఆఫీస్ గది తాళాలు పగులగొట్టి అందులోని కంప్యూటర్‌తో పాటు సంబంధిత పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవలే మన ఊరు-మన పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్లను కూడా ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేసి, గదిలోని వస్తువులను అస్తవ్యస్తంగా పడేశారు. సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుందని తెలిపారు. కాగ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిసర ప్రాంతాలను గాలించారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై ఏ.నరేష్‌కుమార్ మండల ప్రజలను కోరారు. ఇటీవల పాఠశాలలు, మండలంలో దొంగతనాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లకు తాళం వేసి వెళితే బంగారు ఆభరణలు, నగదు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

పారిశుధ్య కార్మికురాలిపై దాడి

ఎల్లారెడ్డిపేట, జూలై 26: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య కార్మికురాలు ర్యాకం నర్సవ్వపై యువకుడు బత్తుల రాజు దాడి చేసిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని నర్సవ్వ పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఇంటి పక్కన ఉన్న బత్తుల రాజుతో కొంత కాలంగా స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో ఒంటరిగా ఉన్న నర్సవ్వపై రాజు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయపడింది. స్థానికులు గమనించి అడ్డుకున్నారు. తీవ్ర గాయాలైన నర్సవ్వను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేగంపేట్‌లో వ్యక్తిపై..

రామగిరి: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గురువారం రాత్రి వాట్సాప్ మేసెజ్‌తో వచ్చిన వివాదం చివరికి ఓ వ్యక్తిపై దాడికి దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి గ్రామానికి సంబంధించిన గ్రూప్‌లో అభ్యంతరకరంగా ఉన్న వ్యాఖ్యలతో కూడిన అంశాన్ని వాట్సాప్‌లో పోస్టు చేశాడు. వాట్సాప్ మెసెజ్ విషయంపై అడిగిన దాసరి శ్రీనివాసును సాయితో పాటు సురేందర్, దశరథం అనే మరో ఇద్దరు వ్యక్తులు నీకు ఎందుకు అంటూ దుర్భాషలాడుతూ బీర్ సీసాను పగలగొట్టి శ్రీనివాస్‌పై దాడికి పాల్పపడినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, జూలై 26: మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన మాకోటి లక్ష్మయ్య (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మధుసూధన్ రావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్స పొందుతూ ఉండేవాడని ఈ మధ్యకాలంలో కిడ్నీ నోప్పి తీవ్రత ఎక్కువగా కావడంతో శుక్రవారం పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన పక్కన ఉన్న రైతులు కుటుంబ సభ్యుల సహకారంతో వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రామగిరి, జూలై 26: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన కాసాని వినోద్(32) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వినోద్‌కు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో కాలు విరిగిపోగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. విరిగిన కాలుతో మేస్త్రీ పనులు చేయలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. మానసికంగా కలత చెందిన వినోద్ శుక్రవారం తెల్లవారు జామున తాడుతో దూలనికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కాసాని అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీఆర్ పాలనలో నిండుకుండలా గోదావరి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గోదావరినదిని పరిశీలిస్తున్న కేటీఆర్

గోదావరిఖని, జూలై 26: కేసీఆర్ పాలనలో గోదావరినది నిండుకుండాలా ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎండిన గోదావరి దర్శనమిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో పర్యటనకు వచ్చిన కేటీఆర్ శుక్రవారం ఉదయం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి వంతెనపై ఆగి గోదావరినదిని పరిశీలించారు. ఎండిన గోదావరినదిని చూసి కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కన్నేపల్లి పంప్‌హౌస్ నడిపి నీటిని ఎత్తిపోస్తే గోదావరినది నిండుకుండలా ఉంటుందని కేటీఆర్ అన్నారు. పర్యటనలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఇండియన్ బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



బ్యాంకు ఎదుట మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు

శంకరపట్నం, జూలై 26: తమకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ కాలేదని మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంకు ఎదుట శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఇతర బ్యాంకుల్లో రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ అయ్యిందని, ఇండియన్ బ్యాకులో ఎందుకు కాలేదని రైతులు బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. రుణమాఫీ జాబితా పంపించారా అని మేనేజర్‌ను ప్రశ్నించారు. జాబితా పంపిస్తే తమకు చూపించాలని మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మండల వ్యవసాయాధికారిని ఫోన్ ద్వారా సంప్ర దించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 26 : వరకట్న వేధింపుల కేసులో మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఆంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆంజనేయులు తన భార్య ఎనగంటి రేఖను వరకట్నం కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి శాంతమ్మ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి

సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, జూలై 26: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ క్యాంపులోని గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రాజారపు గణాధిత్య(13) ఫిట్స్‌తో శుక్రవారం మృతి చెందాడు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. మెట్‌పల్లి అనుసంధానమైన ఆరపేట గ్రామానికి చెందిన రాజారపు మహేష్, లావణ్యలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు పుట్టిన రెండు నెలలకు, చిన్న కుమారుడు ఆరేళ్ల కింద ఫిట్స్‌తో మృతి చెందారు. రెండో సంతానం అయిన గణాధిత్యను మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవలే చేర్పించారు. శుక్రవారం ఉదయం పాఠశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి గణాధిత్యకు ఫిట్స్ వచ్చింది ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సమాచారం అందించారు. విద్యార్థి తండ్రి వెంటనే పాఠశా లకు చేరుకుని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.



విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గణాధిత్య(ఫైల్)

పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడని తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపల్ విద్యసాగర్‌ను వివరణ కోరగా విద్యార్థులు అంతా కలిసి వార్డులో నిద్రిస్తున్నారని, అంతలోనే గణాధిత్యకు ఫిట్స్ వచ్చినట్లు తోటి విద్యార్థులు సిబ్బంది దృష్టికి తేవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం అందించినట్లు వివరణ ఇచ్చారు.

భయంతో ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మండలంలోని పెద్దాపూర్ క్యాంపు గురుకుల పాఠశాలలోని విద్యార్థులు భయంతో ఇంటి దారి పట్టారు. పాఠశాలలో శుక్రవారం వేకువ జామున విద్యార్థి గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందడంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



బొందయ్య మృతదేహం

చిగురుమామిడి, జూలై 26: మండలంలోని రేకొండకు చెందిన మొగిళి బొందయ్య (70) ప్రమాదవ శాత్తు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. బొందయ్య గొర్రెలను మేపడానికి వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం గొర్రెలను ఇంటికి తోలుకొస్తున్నక్రమంలో ఓ గొర్రె పిల్ల సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడింది. దానిని రక్షించడానికి బొందయ్య తాడు సహాయంతో బావిలోకి దిగాడు. గొర్రె పిల్లను బావిలోంచి బయటకు తీశాడు. బావి నుంచి బయటకు వస్తున్న క్రమంలో తాడు తెగిపోయి బావిలో పడి నీట మునిగి మృతి చెందాడు. బొందయ్య కుటుంబసభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు.

ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిష్టంపల్లి శివారులో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన మార్వాడి రాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాములు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్సారెస్పీ నిర్మాణం ప్రారంభించి 61 ఏళ్లు పూర్తి

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ వరద ప్రదాయినిగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంఖుస్థాపన జరిపి నేటికి 61 ఏళ్లు పూర్తవుతోంది. 1963 జూలై 26వ తేదీన అప్పటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పోచంపాడ్ వద్ద పునాది రాయి వేసిన రోజును పలువురు రైతులు, అధికారులు నెమరువేసు కుంటున్నారు. నీటి పారుదల జలాశయాలు ఆధునిక దేవాలయాలుగా ప్రధాని నెహ్రూ అభివర్ణించారని గుర్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోచంపాడ్ ప్రాజెక్టు వద్ద పండిట్ నెహ్రూ విగ్రహానికి శుక్రవారం పలువురు ఎస్సారెస్పీ అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా డ్యామ్ వద్ద గల నీటి ప్రవా హంలో గోదావరి తల్లికి పూలు సమర్పించారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈ చక్రపాణి, డీఎస్ఈ లాల్ సింగ్, డీఈఈలు గణేష్, సుకుమార్, రఘుపతి, డ్యామ్ ఏఈఈ వంశీ పాల్గొన్నారు.



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

ఎన్టీపీసీలో ముగిసిన కేవీ రీజినల్ స్పోర్ట్స్

జ్యోతినగర్, జులై 26: రామగుండం ఎన్టీపీసీలో రెండు రోజులుగా జరుగుతున్న కేంద్రియ విద్యాలయాల(కేవీ) రీజినల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఎన్టీపీసీ జ్యోతిక, స్పందన ఇండోర్ స్టేడియంల్లో జరిగిన పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌లోని కేంద్రియ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎస్.శ్రీజ (పికెట్ కేంద్రియ విద్యాలయం) ప్రథమ, దండు తేజశ్విని (నల్గొండ కేవీ) ద్వితీయ, ఏంజెల్ (గచ్చిబౌలి కేవీ) తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 19 విభాగంలో కె జాహ్నవి (కాకినాడ కేవీ) మొదటి స్థానం, ఎస్ సహర్ష(పికెట్) రెండో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన విద్యార్థులు హైదరాబాద్ రీజియన్ జట్టుకు ఎంపికయ్యారని, త్వరలో జరగబోయే కేంద్రియ విద్యాలయాల సంఘటన్ ఆధ్వర్యం లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొం టారని ఎన్టీపీసీ కేంద్రియ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్‌బాబు తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతం చేయడంలో సహకరించిన ఎన్టీపీసీ యాజమాన్యానికి, ఇతర సిబ్బంది, కోచ్, ఉపాధ్యాయులకు శోభన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.



పతకాలు అందుకున్న అండర్ 19 విజేతలు

బెంబేలెత్తిస్తున్న చోరీలు

- వరదకాలువకు అమర్చుకున్న ఫ్యూజ్‌లను వదలని దొంగలు
- వరుస చోరీలతో రైతుల ఆందోళన

మల్యాల, జూలై 26: వరదకాలువ నీటి ఆధారంగా సాగు చేసుకునే రైతులు దొంగతనాలతో ఆందోళన చెందుతున్నారు. కాలువలోని నీటిని వినియోగించుకునేందుకు గాను ఏర్పాటు చేసుకున్న పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను గత కొన్నేళ్లుగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లడంతో బెంబె లేత్తుతున్నారు. ప్రతి ఏటా ఇదే విధంగా వరుసగా కొనసాగుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ నుంచి బల్వంతాపూర్ శివారు వరకు గల దాదాపు 14కి.మీల వరద కాలువకు వందలాది రైతులు పంప్‌మోటార్లను అమర్చుకొని సాగు చేసుకుంటున్నారు.



ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లిన్నట్లు చూపుతున్న రైతులు

అయితే గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను ఎత్తుకెళుతున్నారు. కొన్నేళ్లుగా కాపర్ తీగలతో పాటు విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళుతున్నారు. తాజాగా గురువారం అర్థరాత్రి కూడా నూకపల్లి శివారు నుంచి మల్యాల శివారు వరకు గల విద్యుత్ పంప్‌సెట్ల వద్ద స్టార్టర్ బాక్స్‌లకు అమర్చిన 20 మంది రైతు లకు సంబందించిన ఫ్యూజ్‌లను ఎత్తుకెళ్లారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడం, పంటల సాగు కొనసాగు తున్న తరుణంలో దొంగలు కాపర్, విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో దొంగలు చిక్కినా..

ఈ ప్రాంతంలో కొన్నాళ్ల క్రితం పంప్‌మోటార్లను పగులగొట్టి కాపర్‌తీగలు, విద్యుత్ తీగల దొంగతనాలకు పాల్పడిన దొంగలు గత రెండేళ్ల క్రితం పట్టుబడగా కేసులు కూడా నమోదు అయ్యాయి. వారి వద్ద తీగలు రికవరీ చేసినా రైతులకు అందలేదు. అదిఅలా ఉంటే దొంగతనాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా పంటల సాగు సీజన్‌లలో వరుస దొంగతనాలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విద్యుత్ తీగలలో ఉండే కాపర్ తీగల కోసం నిప్పంటించి కాపర్‌నే వేరు చేసి అమ్ముకుంటారు. గత నెల రోజుల నుంచి మూడు సార్లు నూకపల్లి శివారు నుంచి బల్వాంతపూర్ వరకు పదుల సంఖ్యలో రైతుల విద్యుత్ తీగల చోరీకి గురి అయ్యాయి. దీంతో ఇటీవల రైతులు కాపర్ తీగలకు బదులు అల్యూమినియంతో ఉండే తీగలను ఏర్పా టు చేసుకుంటున్నారు. దొంగల బెడదను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవల్సి ఉంది.

నష్టపోవాల్సి వస్తుంది

రాయలింగం, రైతు, నూకపల్లి

వరదకాలువకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్ల కాపర్, విద్యుత్ తీగలను తరచూ ఎత్తుకెళ్లడంతో మళ్లీ కొనుగోలుతో నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగుకు కూడా ఇబ్బందులు అవుతున్నాయి. కొన్ని సార్లు రాత్రి వేళల్లో కాపాలా కూడా ఉండాల్సి వస్తుంది. దొంగతనాల నివారణకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలి. పర్యవేక్షణ కూడా చేయాలి.

మహిళా శక్తి పథకంతో ఆర్థిక అభివృద్ధి



మహిళ సంఘ సభ్యులకు సూచనలు చేస్తున్న అధికారులు

కోరుట్ల, జూలై 26 : మహిళ శక్తి పథకంతో మహిళలు సామాజికి ఆర్థిక అభివృద్ధి చేందుతారని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని స్త్రీ శక్తి భవనంలో మహిళా శక్తి పథకంపై మహిళా సంఘాలు, రిసోర్స్ పర్సన్స్‌కు మెప్మా అడ్మినిస్ట్రేట్ అధికారి శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ శక్తి పథకంలో మహిళలకు అందే లబ్ధిపై వివరించారు. మహిళ క్యాంటిన్‌లతో పాటు స్త్రీనిధి లింకేజ్, బ్యాంక్ లింకేజ్‌ల ద్వార నిధుల సమకూర్చేందుకు మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాబోయే సంవత్సరంలో రూ. 2.89 కోట్ల రుణ సదుపాయం ఉందని వాటిని సద్వినియోగం చేసుకోని మహిళలు అర్థికంగా ఎదుగాలన్నారు. ప్రతి మహిళ సంఘ సభ్యురాలికి స్త్రీ నిధి పథకంలో ప్రమాద బీమా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డియంసీ సునిత, టియుసి శ్రీరాం గౌడ్, మెప్మా రిసోర్స పర్సన్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల అస్వస్థత

మెట్‌పల్లి రూరల్, జూలై, 26 : మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రాపర్తి హర్షవర్ధన్, అడేపు గణేష్ అను విద్యార్థులకు గుర్తు తెలియని పురుగు కుట్టడంతో ఒంటిపై దద్దుర్లు వచ్చి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచాచం అందించగా వారు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి చికిత్స అందించగా విద్యార్థి అడేపు గణేష్‌ను మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి మృతి పట్ల విచారణ జరపాలి

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనికెల నవీన్

మెట్‌పల్లి, జూలై, 26 : మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థి మృతి పట్ల విచారణ చేపట్టాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనికెల నవీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి మృతి పట్ల కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో విద్యార్థి ఉన్న విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా చేసిన నిర్లక్ష్యం వల్లే ప్రాణాలు కోల్పోవాల్సి దుస్థితి ఏర్పడిందన్నారు. నెలకు ఒక్కసారైనా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించలేని స్థితిలో ప్రభుత్వ అధికారుల ఉన్నారన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకోని విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో సమీయొద్దీన్

మల్లాపూర్ 26 : పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుని వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సమీయొద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్యంపేట గ్రామంలోని ఖాళీ ప్రదేశాలు, పరిసరాలను పరిశీలించి లార్వాను గుర్తించి తొలిగింప చేయించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి నిల్వ ఉన్న నీరు పారపోయించి లార్వాను అంతం చేయడానికి పైరేత్రం స్ప్రే చేయించడంతో పాటు గుంతలలో టీమోఫాస్ వేయించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాహిని, రామ్‌మోహన్, వైద్య సిబ్బంది ఇందిరా, నిర్మల, శ్రీనివాస్, మునీర్ రమాదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులైన సైనికులకు నివాళులు



మెట్‌పల్లిలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న సభ్యులు

మెట్‌పల్లి, జూలై, 26 : కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా అమరులైన వీర సైనికులకు మెట్‌పల్లి లయన్స్ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలో కొవొత్తులతో అమరవీరులైన సైనికుల కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు వీరోచితంగా పోరాడి శత్రువులను తరిమికొట్టారని, పోరాటం మరణించిన సైనికులకు నివాళులర్పించాల్సిన బాధ్యత మనందరిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్, కార్యదర్శి గూండా రాకేష్, కోశాధికారి నాంపల్లి వేణు, గోపాల్, ప్రోహర్ తుకారాం, చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, బాస నరసింగరావు, మర్రి భాస్కర్, వెల్మల శ్రీనివాస్‌రావు, అరుణ్‌దీప్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడింది



ఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్ 26 : మండలంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునర్ధురణకు మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని, తెరిపిస్తామని ఇచ్చిన హామీ నిలుపుకోవడం ఎంతో హర్షదాయకమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారావు అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులు, రైతులతో కలిసి షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లేక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ అధికారంలోకి వస్తే మూసివేతకు గురైన చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న హామీని గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఫ్యాక్టరీ ప్రారంభానికి నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించడం చాలా ఆనందగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెట్టి లింగం, మహేందర్‌రెడ్డి, సాయి, నల్ల బాపురెడ్డి, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

మల్యాల, జూలై 26: మండలంలోని ముత్యంపేట(బ్లాక్)కు చెందిన వేముల బాలయ్య(103)అనే శతాధిక వృద్ధుడు మృతి చెందాడు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలయ్య శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ధర్మపురి, జూలై 26: ధర్మపురి పట్టణానికి చెందిన ఆశెట్టి సాకేత్ అనే యువకుడు గత నెలలో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను ఏఎస్ఐ రాజేశం శుక్రవారం ఆయనకు అప్పగించారు. గత నెల రోజుల క్రితం సాకేత్ తన మొబైల్ రెడ్ మి నోట్ 8 పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తెలుసుకుని ఆయన అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు సాకేత్ ఏఎస్ఐ రాజేశంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ యేడూ ఇక్కట్లు తప్పవా..?

- తక్కళ్లపల్లి - సిరికొండ వంతెన పూర్తయ్యేదెప్పుడో
- వాగు ఉధృతితో నిలిచిన రాకపోకలు
- ఎనిమిదేళ్లయినా ముందుకు సాగని పనులు

కథలాపూర్, జూలై 26 : ముచ్చటగా మూడు ప్రభుత్వాలు మారినా తక్కళ్లపల్లి - సిరికొండ వంతెన నిర్మాణానికి మాత్రం మోక్షం లభించడం లేదు. పాలకులు ఈ వంతెన పేరు చెప్పుకుని ఓట్లు దండుకున్నారే తప్ప ప్రజల అవస్థలను మాత్రం పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. దాదాపు దశాబ్ద కాలంగా ఆ గ్రామాల ప్రజానీకం పడుతున్న అష్ట కష్టాలు నేతలకు కనిపించకపోవడం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏటా వర్షాకాలంలో వాగు ఉధృతి పెరుగుతున్న క్రమంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● పరిహారం చెల్లింపు పూర్తయినా ముందుకు సాగని పనులు

మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాలను కలిపే ఈ వంతెన నిర్మాణం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి రోడ్లు భవనాల శాఖా మంత్రి జీవన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో పనులకు కొంత మేర జాప్యం జరిగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2016లో అప్పటి కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు శంఖుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినా కేవలం 50 శాతం మాత్రమే పూర్తి చేసి అర్ధాంతరంగా నిలిపివేశాడు. వంతెన నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు తమకు డబ్బులు చెల్లించాకే పనులు కొనసాగించాలని అడ్డుకోవడం వల్ల కొంత జాప్యం చోటు చేసుకుంది. పరిహారం చెల్లింపు ప్రకియ ఈ మధ్యకాలంలోనే పూర్తయింది. సుమారు రు. 70 లక్షల మేర పరిహారం రెవెన్యూ అధికారుల సర్వే మేరకు అందజేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌ను పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నా పట్టిం చుకోవడం లేదని తెలుస్తోంది.

● వాగు ఉధృతికి నిలిచిన రాకపోకలు

గంభీర్‌పూర్, తుర్తి అడవుల్లోంచి వరద నీటి ఉధృతి పెరగడంతో వాగు నుంచి రాకపోకలు సాగించడానికి వీలు లేకుండా పోయింది. దీంతో తక్కళ్లపల్లి వాసులకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మండల కేంద్రం కోరుట్ల నుంచి సుమారు 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన



అర్ధాంతరంగా నిలిచిపోయిన తక్కళ్లపల్లి - సిరికొండ వంతన



ఎనిమిదేళ్ల కిందట వేసిన శిలాఫలకం

దుస్థితి దాపురించింది. భీమారం, మేడిపల్లి మండలాల ప్రజలు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో అనేక సార్లు బీఆర్ఎస్ నేతలకు తక్కళ్ళపల్లి, సిరికొండ గ్రామాల ప్రజాప్రతినిధులు వినతి పత్రాలు అందించినా ఫలితం శూన్యమే అయింది. మొన్నటి దాకా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీలు పనులు పూర్తి చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసనలు చేశారు. అయితే కొత్త ప్రభుత్వం కొలువు తీరి ఏడు మాసాలు కావస్తుండగా ఈ వంతెన పనులపై ఆశలు పెంచుకున్నారు. అయితే ఈ ఏడాది కూడా పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. ఈ కష్టాలు ఎన్నేళ్ళు భరిస్తామని ఆందోళన వెలి బుచ్చుతున్నారు. ఎమ్మెల్యే చొరవ చూపి కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించి తమ ఇక్కట్లు తొలగించేలా చూడాలని జనం కోరుతున్నారు.

నదీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎర్దండి గోదావరి నదిని పరిశీలించిన కలెక్టర్



గోదావరి నదిని పరిశీలిస్తున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం, జూలై 26: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు, నది పరిహావాక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎర్దండి గోదావరి నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో నాలుగు రోజులు వర్షలు ఉన్న నేపథ్యంలో వాగులు పొంగిపొర్లి చెరువులు నిండు కుండలుగా ఉన్నాయని, ప్రమాదకరంగా ఉన్న చెరువుల వద్దకు పిల్లలు, యువకులు ఎవరు వెళ్లవద్దని సూచించారు. వాగుల వద్ద, నదుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. మట్టి ఇళ్లలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తక్షణ సహాయం కోసం డయల్ 100 సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీస్‌లు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండ చర్యలు చేపట్టాలని అదేశించారు. ఆనంతరం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో డ్రైనిజీని పరిశీలించారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని, డ్రైనిజీలను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు అదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవవో శేఖర్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో వంటశాలను, స్టోర్‌ను పరిశీలించారు. ఆనంతరం విద్యార్థులను అకాడమీ ఇయర్ సెలబస్ గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు రాయడం చవడం గణితం ఇంగ్లీష్, హింది, సిలబస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అదేశించారు. ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. 10వ తరగతి విద్యార్థులపై శ్రద్ధ చూపించి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేల చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జువ్వాడికి సన్మానం

కోరుట్ల, జూలై 26 : పట్టణంలోని మార్కండేయ మందిరంలో శుక్రవారం పద్మశాలి సంఘ నాయకులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావును సన్మానించారు. పద్మశాలి సంఘ అభివృద్ధికి నిదులు మంజూరికి కృషి చేసి మంజూరి అయ్యే విధంగా చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తూ పద్మశాలి సంఘ సభ్యులు జువ్వాడి నర్సింగ రావును పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం పద్మశాలి సంఘ నాయకులు రుద్ర శ్రీనివాస్, ఆడెపు మధు, ముల్క ప్రసాద్, గుంటుక ప్రసాద్, కటకం జగదీశ్వర్, ఎంబేరి సత్యనారాయణ, మచ్చ కవిత, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్ కుమార్, తిరుమల గంగాధర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

దశ దిశ లేని రాష్ట్ర బడ్జెట్

● రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి

కథలాపూర్, జూలై 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దశ దిశ లేకుండా ప్రజలను మోసం చేసేలా ఉందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ దేవస్థానం అభివృద్ధికి ఒక్క రూపాయి వెచ్చించకపోవడం దారుణమని అన్నారు. నిరుద్యోగ భృతి రు. 4 వేలు, రైతు కూలీల జాడలేదు, కౌలు రైతుల ఊసే లేదని దళిత బంధుకు రాం రాం చెప్పారని అన్నారు. విద్యార్థులకు రు. 5 లక్షల ఆర్థిక భరోసాను పట్టించుకోలేదన్నారు. గల్ఫ్ సంక్షేమ నిధికి నిధులు కేటాయిస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు.

మున్సిపల్ అభివృద్ధికి కలిసి రావాలి

మెట్‌పల్లి, జూలై, 26 : మెట్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి కలిసి రావాలని చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్య నారాయణలను కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డులో పేర్కొపోయిన సమస్యలను వివరిస్తూ నిలిచిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, కౌన్సిలర్ దావనపల్లి రాజరాం, ఆకుల లింగారెడ్డి, జెట్టి లక్ష్మణ్, పుల్లూరి వెంకటేష్, భరత్, మహేందర్, పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జగిత్యాలరూరల్, జూలై 26 : పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జగిత్యాల మండలంలోని అంబారిపేట గ్రామంలోని శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయితీ రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జడ్పీ సీఈవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అధికారులు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఎంపీవో సలీం, పంచాయితీకార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో రక్త దాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు సిబ్బంది

కొడిమ్యాల, జూలై 26 : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం కళాశాల ఎన్‌ఎస్ఎస్ జగిత్యాల రెడ్ క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వ హించారు. ఈ శిబిరంలో సుమారు 20 మంది రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, జిల్లా మాజీ అధ్యక్షుడు టీవి. సూర్యం, ముత్తు, ప్రిన్సిపాల్ ప్రోఫెసర్ బి. ప్రభాకర్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు

జగిత్యాలరూరల్, జూలై 26 : జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమరవీరులకు నివాళులు అర్పించారు. వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, పంచాయితీకార్యదర్శులు పాల్గొన్నారు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 26: వరకట్న వేధింపుల కేసులో మండలంలోని వెంకట్రావు పల్లెకు చెందిన ఆంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆంజనేయులు తన భార్యను వరకట్నం కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

కొడిమ్యాల, జూలై 26 : కొడిమ్యాల పట్టణ పద్మశాలీ సేవా సంఘం నూతన అధ్యక్షుడు అంకం రాజేశం, ప్రధానకార్యదర్శి కైల సాని సత్యనారాయణను శుక్రవారం వారి మిత్రులు మండల కేంద్రంలోని అంగడి బజారులో శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, కొత్తూరి స్వామి, పద్మశాలీ సేవా సంఘం నాయకులు, పలువురు సభ్యులతో పాటుగా వారి మిత్రులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

రాయికల్, జూలై 26: రాయికల్ పట్టణానికి చెందిన ముక్కెర జ్యోతి (27) అనే మహిళ అదృశ్యమైంది. గురువారం మధ్యాహ్నం నుంచి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని, ఇంటికి తిరిగి రాలేదని ఆమె భర్త ముక్కెర రమేష్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

కేడీసీసీ జిల్లా మెంబర్‌గా సాగర్

బీర్‌పూర్, జూలై 26: కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్ జిల్లా డైరెక్టర్‌గా బీర్‌పూర్ మండలానికి చెందిన మందాటి సాగర్‌ను ఎన్నిక చేశారు. కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్‌లో జిల్లా డైరెక్టర్‌గా ఎస్టీకి అవకాశం ఉండడంతో బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన మందాటి సాగర్‌ను శుక్రవారం టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావ్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావులకు సాగర్ కృతజ్ఞతలు తెలిపారు.

బీర్‌పూర్ తహసీల్దార్‌గా శ్రీనివాస్

బీర్‌పూర్,జులై 26: మండల తహసీల్దార్‌గా ఏ.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో బీర్‌పూర్‌లో విధులు నిర్వహించిన నరేష్ సిద్దిపేట్ జిల్లాకు బదిలీపై వెల్లగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరెట్ కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను బీర్‌పూర్ తహసీల్దార్‌గా నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కార్యాలయానికి సమస్యల విషయంలో వచ్చిన ప్రతి ఒక్కరికి తక్షణ పరిష్కారం జరిగేవిధంగా చూస్తానని అన్నారు.

ఘనంగా బోనాల జాతర మహోత్సవం



బోనాల శోభయాత్రలో పద్మశాలి సంఘ మహిళలు, సభ్యులు

కోరుట్ల, జూలై 26 : పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా సాగింది. ఆషాఢమాసం పురస్కరించుకోని సంఘ సభ్యులు మహిళలు బోనాల జాతరను నిర్వహిం చారు. పట్టణంలోని పలు వీదుల గుండా మహిళలు బోనాలను ఎత్తుకోని కార్గిల్, వేంకటేశ్వర దేవాలయం సమూహంగా ఏర్పాడి శోభయాత్రను నిర్వహించారు. శోభాయాత్ర పట్టణంలోని కోటి నవదుర్గ దేవాలయం వరకు సాగింది. శోభయాత్రలో పోత రాజుల నృత్యాలు అలరింపజేశాయి. ఈ సందర్భంగా కోటి నవ దుర్గ దేవాలయంలో వేదపండితులు ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చన అభిషేకాలు జరిపారు. మహిళలు అమ్మవారి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు ప్రత్యేక పూజలలో పాల్గొన్న బోనంను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, ఎంబేరి నాగభూషణం, పద్మశాలి సంఘ సభ్యులు రుద్ర శ్రీనివాస్, అడెపు మధు, కటకం జగదీశ్వర్, జిల్లా దనంజయ్, మచ్చ కవిత, ముల్క ప్రసాద్, గుంటుక ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గంభీరావుపేట, జూలై 26 : గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో ఇటీవల తాటి కొండ కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు కిష్టయ్య కుటుంబానికి శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. తిరుపతి మాట్లాడుతూ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సూచనల మేరకు సాయాన్ని అందజేశామన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి. మాజీ సర్పంచ్ పూజం భూమరాజం, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు ఎర్ర కిషన్‌గౌడ్, వేణు, సంతోష్, రామిరెడ్డి, నాంపెల్లి, దేవ గౌడ్, రాజయ్య, మారుతి, స్వామి, రవి, సంప త్, సత్తయ్య, స్వామి ఉన్నారు.

దళితుల హామీలను నెరవేర్చాలని బీజేపీ ధర్నా

ధర్మపురి, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ధర్మపురి పట్టణంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం రాస్తా రోకో ధర్నా నిర్వహించారు. ఉదయం వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల జాతీయ రహదారి వరకు చేరుకున్నారు. అనంతరం రహదారిపై బైఠాయింపు జరిపి నిరసన వ్యక్తం చేశారు. రహదారి ఇరువైపుల వాహనాలు నిలచి పోయాయి. కార్యకర్తలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులో దళితులకు 350 కోట్ల వరకు తగ్గించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వంత నియోజకవర్గానికి 4369 కోట్ల బడ్జెట్ కేటాయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ లోన్స్, వివిధ రకాల దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్ చేరుకుని కార్యకర్తలకు నచ్చ జెప్పి ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్, యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ధర్మపురి మండల అధ్యక్షులు సంగెపు గంగారాం, పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, యువ మోర్చా పట్టణ అధ్యక్షుల గాజు భాస్కర్ పాల్గొన్నారు.



ధర్మపురి జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు